అభినవసరస్వతి

సంపుటము.	ప్రమాది నామసంవత్సరము	సంచిక
౩౧	భాద్రపదమాసము.	౬

కృతివిమర్శము

కాఫీపురాణము— గ్రంథకర్తలు గౌరావఝ్ఝుల రామకృష్ణసీతారామసోదర కవులు. శతావధానులు వెల 0—1—0.

అస్య శ్రీకాఫీదేవతామహామంత్రస్య, అయ్యర్ ఋషిః. కాఫీక్లబ్ ఛందః. ఆంగ్లేయభాషా దేవతా. కాం బీజం. పీం శక్తిః. సీకాయపొడీతి కీలకం. సకలధనాపహారణార్థే వినియోగః. కోకో, అంగుష్ఠాభ్యాంనమః. టీ తర్జనీభ్యాంనమః. ఓవల్టిన్ మధ్యమాభ్యాంనమః. సారా, అనామికాభ్యాంనమః. బ్రాంది కనిష్ఠికాభ్యాంనమః. విస్కి కరతలకరపృష్ఠాభ్యాంనమః. ఉపమా హృదయాయనమః. ఇడ్లి శిరసేస్వాహా. పెసరదోసె శిఖాయైవషట్. మైసూరుపాకు కవచాయహుం. లడ్డూబూందీపకోడీతి నేత్రత్రియాయవౌషట్. మసాలవడ, అస్త్రాయఫట్ - కప్ప్లేట్ మధ్యే దిగ్బంధః.

శ్లో. జాతం లండనునామదివ్యనగరే స్నేహంచ శ్వేతాననైః
ఆనీతం పరదేశవర్తకజనై ర్విధ్యాపణే వర్ధనం
చూర్ణం మ్లేచ్ఛవధూటికాకరతలైః పాపంచ జ్వాలాముఖే
సంసేవ్యం నవనాగరీకసుఖనై ర్వందేచ కాఫీప్రభుం.

మూలమంత్రము— మహిషీక్షీరాయ విద్మహే, శర్కరాగుడాయ ధీమహి, తన్నో కాఫీదేవతా ప్రచోదయాత్.

శ్లో. త్రికాల మేకకాలంవా జపే ద్విద్వాన్ సునిశ్చలః
పీత్వాపీత్వా పునఃపీత్వా స్వర్గలోక మవాప్నుయాత్,
కాఫీతీర్థసమం తీర్థం ప్రసాద ముపమాసమం
అయ్యర్సదృశ దేవేశో నభూతో నభవిష్యతి.

ఇతి శ్రీకలిమాహాత్మ్యే కాఫీదేవతామంత్రోద్ధారో నామ
ప్రథమపటలః

అని యిట్లు కడుఁ జమత్కారముగా గౌరావఝ్ఝులసోదరులు కాఫీపురాణములోని ప్రథమపటలము పరిసమాప్తిఁజేసిరి. చిత్రజనకములగు నిందలి కొన్నిపద్యములు గూడఁ బ్రకటీక్రియమాణములు.

చ. అమృతరసంబుఁ బంచునెడ నాహరి మోహినిరూప మూని యా
అమరుల కిచ్చి రాక్షసుల కందఁగనీయక గొప్ప పక్షపా
తము నొనరించె కాఫి నిడుధన్యులు సర్వసమంబుగాఁగ నీ
అమృతముఁ బంచుచుండెద. రహో! హరికన్నను మిన్న లేకదా!

తే కాఫి దేవర. పెద్దన్న గారు కోకో.
వీరితమ్ముఁడు తేయాకునీరు. వారి
చిన్న చెల్లెలు, ఓవలటిన్ను వీరి
నేస్తగాం డ్రింకఁ దక్కు-పానీయసమితి.

సీ. పూర్వసువాసినీభోగసాధన మిది.
ముత్తైదువుల చెలికత్తె యిద్ది.
అరవవారల మహదైశ్వర్యనిధి యిది.
బేరుల కొంగుబంగార మిద్ది.
బ్రాహ్మణోత్తములకుఁ బారిజాతం బిద్ది.
తురకలపాలి చందురుఁడె యిద్ది.
హీనజాతులుగొల్చు నిలవేలుపగు నిది.
జ్వరబాధితులకు నౌషధమె యిద్ది.
కామినీకాముకుల రతికాలశక్తి
తలుగనీకుండు సంధానకరణి యిద్ది
కలియుగంబున నింటింట వెలసియున్న
దేవదేవుండు శ్రీకాఫిదేవుఁ డరయ.

క. కోకోయనుపానీయము నేకాలముగ్రోలి రుచుల నెఱిఁగినదో బళీ!
కోకోనామజపంబును గోకోకోకోయటంచుఁ గోయిల సేయుఞా.

సీ ఆంగ్లేయవిద్యార్థు లనయముఁ గాఫిపూ
జను జేయకుండినఁ జదువఁగలరె?
సంగీతపాఠకుల్ సద్భక్తిఁ గాఫీని
వేడక రాగంబుఁ బాడఁగలరె?
కవిపుంగవులు కాఫిగారికి మ్రొక్కక
రసవత్ప్రబంధముల్ వ్రాయఁగలరె?

ఉన్నతోద్యోగస్థు లెన్నిమాఱులో కాఫి
చేపట్టకయె పనుల్ సేయఁగలరె ?
వారకాంతలు కాఫి దేవరకుఁ దొలుత
అంజలి ఘటింకగయె నాట్య మాడఁగలరె ?
మాట లేఁక వేయునేల ? ఈనాఁటివారి
పాలి దేవుండు శ్రీకాఫిప్రభువరుండు.

ఇయ్యవి చమత్కృతిజనకములే కాక యనుభవమునకుఁగూడ సరిపోవుచున్న యవి.

—♦ కొల్లాపుర రాజభవనమున జరిగిన హరికథ ప్రశంస ♦—

సీ. శ్రవణమూ శ్రీరామచంద్రుని పాదుకా
పట్టాభిషేకంబు భవ్యకథది.
స్థానమూ జటప్రోలుసంస్థాన రాజ్యంబు
పాలించుచుండెడి యేలికలది.
చెప్పించు రాజ్ఞియా శ్రితకల్పవల్లియౌ
సురభి రత్నాంబ భూసురవలంబ.
సభ్యులా వేదశాస్త్రజ్ఞులు సుకవులుః
లౌకికజ్ఞానులు లాక్షణికులు.
ఇట్టి శుభలక్షణంబుల కిక్కయైన
సభను జూచుట నేఁటికి సంభవించె.
ఈపరి ఘటింపనైన కొల్లాపురంపు
యాత్ర సౌభాగ్యసూచక మహహ నాకు.

క. ఈదృక్పరిదర్శనంబున
కేదేవి యనుగ్రహంబు హేతువొ తలఁపఁగా
శ్రీదయితుఁడు కడుప్రేముడి
నాదేవిని మనుచుఁగాక యల రత్నాంబన్.

హరిజన దేవాలయ ప్రవేశము

రమారమి యిప్పటి కేఁబదియవది సం॥ ల నుండి ప్రజలు కాంగ్రెసు పేర నొక సంఘముగాఁ జేరి బ్రిటీషుప్రభుత్వవిధానమునఁ బెక్కు లోపము లున్నవనియు ననుకూల సంస్కారణము లాచరింపవలెననియు నత్యంతము నాందోళనచేసి స్వార్థత్యాగులై జైళ్ళలో నుండుటకుఁగూడ సహించి చివరకు స్వేష్టపూర్తి చేసికొనుట కెంతయు సంతోషము. అవనీపతు లన్యఖండవాసులైన యాంగ్లేయులైనను మంత్రులు మనవారైనందులకు మఱియు సంతోషము. కాని యీ కాంగ్రెసుప్రభుత్వపద్ధతి ప్రజల బిడ్డలంబోలెఁ బాలించిన క్షత్రియప్రభుత్వము క్షయించి మరల మనదేశము బ్రిటీషువారి పరిపాలన క్రిందికి వచ్చుటకు మధ్యకాలమున నేలిన తురుష్కులను స్మరింపఁజేయుటకుమాత్రము దుఃఖింపక తప్పకవచ్చినది. ఆ మ్లేచ్ఛప్రభుత్వములలోఁ బురుషుల బొట్టుకుఁబన్నినియు జుట్టుకుఁ బన్నినియు సతుల చంటికిఁ బన్నినియు నేమోయనియు శాసనాదులు చదువు నప్పుడే సవిచారుల మగుచుంటిమి. అద్దానినే యనుభవింపలేని యస్మదాత్మల కద్యతన కాంగ్రెసుప్రభుత్వమం దంతకు మించిన యష్టకష్టములు ననుభవింపవలసివచ్చినది. స్వయముగాఁ గనిపెంచిన సంతానమునకు జననీజనకులు సకాలమున వివాహములు చేయుటకు వీలులేకపోయెను. చేసిన జైలులోఁ జేరవలసెను. ఎప్పుడో యేప్రభువుల చేతనో యీఁబడి వంశపరంపరగా ననుభవించు వసుమతిలో నర్ధాదాయమునుబట్టి యనుకూలమైన మార్పులు చేసికొనుట కగ్రహారికుల కధికారము లేకపోయెను. కూలికి వచ్చిన కౌలుదారు కొసవఁ దద్వసుమతీశుఁడు. అబ్ద మబ్దము నీఁక నావ్యావసాయికుఁడు పెట్టిన భిక్షనుండి యాయగ్రహారికుఁడు జీవింపవలయును. ప్రజ లెల్లరును బ్రత్యక్షముగా ననుభవించు నిట్టి చెట్టలెన్నియని యేను జెప్పుదును? కాని యన్నిటిని మించినది హరిజనప్రశంస. వాస్తవమయినను వారిని గూరిచి యేమి వ్రాసినను దీనజనోద్ధరణమునఁ దీక్షని బద్ధకంకణత తమ కున్నట్లును మాకు లేనట్లును సంస్కారణప్రియులు చాటుచుందురు. వారు వాకుచ్చు వాక్యము లన్నియు నశాస్త్రీయములు. శాస్త్రసిద్ధమయిన జవాబు చెప్పలేరు సరికదా! యుక్తిచేఁ గూడ యుక్తమిదియని యొక్క విషయమునుగూడ సమర్థింపఁజాలరు. శాస్త్రముతో మాకుఁ బనియే లేదని స్వేచ్ఛ ననుసరింతురు. దేని ననుసరించినను రాజకీయవిద్యాప్రావీణ్యముచే రచ్చలకెక్కి రాయి గ్రుద్దఁగలుగుచున్నారు.

రాజకీయవిద్యాప్రావీణ్యముచేతనే రాజ్యమునఁ బ్రాజ్యమైన ప్రధానపదవి పడయఁగలిగిరి. యథేచ్ఛముగా వ్యవహరించుచుండిరి. సర్వసంకరము సేయ సమకట్టిరి. అంత్యజుల నంటుకొనవచ్చునఁట. అస్పృశ్యతానివారణముఁట. హరిజనులఁట. ఏనాఁడైనను నీ హరిజనశబ్దముతో నంత్యజులను వాడియుండిరా? శ్రుతిస్మృతిపురాణేతిహాసములలోఁ జూడము. కావ్యచంపూనాటకములలోఁ గనఁబడదు. నిఘంటువులలో నిప్పచ్చరము. వేదశాస్త్రములు వీరికి విశ్వాసపాత్రములు కాకపోయినను గావ్యనాటకాదులలోనైనను గనఁబఱుపవలయును. నిఘంటువులనైనను నెమకవలెను. ఆఖరుకు శాసనములలోనైనను నగపఱుపవలెను. అఖిలవిధగ్రంథములను నగుపడని యంత్యజుల

హరిజనశబ్దవాచ్యత కడకు గాంధీగారి కంఠస్థమై క్రాలఁగలిగెను. అనంగీకృతాగమాది ప్రామాణ్యులైన యాంగ్లేయవిద్యానిపుణులకు నాయకుఁడైన గాంధీగారి కంఠమునుండి వెలువడుటతోనే యంత్యజులు హరిజనులైపోయిరి.

కాంగ్రెసువారి క్రమపద్ధతి యంతయు నేగ్రంథమందును నేకాలమందును నెఱుఁగని యంత్యజులకువాడెడి హరిజనశబ్దమే యవగతముచేయుచున్న డి. ఇంగ్లీషువారిచే నెట్టియధికారము నీయఁబడక కారాగారములఁ జేరుచున్న నాఁడే కాంగ్రెసులో ఘటకులైన పెక్కు రంత్యజుల హరిజనులఁజేసినట్లే యస్పృశ్యతఁగూడఁ దొలఁగఁ ద్రోసి భవనములఁ బ్రవేశపెట్టుకొనుటయే కాక బావులలోనినీళ్ళుగూడఁ జేఁదించి వారి చేతి మీఁదుగానిచ్చిన తీర్థము పుచ్చుకొని పవిత్రంమన్యులై యున్నవారు. సభలలోను త్మ్రమరవీధులను యథేచ్ఛముగా విహరింప నాహరిజనులఁ బ్రేరేచి యందులకై సత్యాగ్రహములుగూడ సల్పియున్నవారు. గురువాయూరుమున్నగు గొప్పగొప్పస్థలము లిందులకుఁ బ్రబలనిదర్శనములు. ఎన్ని చేసినను నయ్యవి సర్వసంకరము సల్పుటకుఁ జాలినవి కావు.

అప్పుడే యట్టిసాహసము చూపిన యవ్వారికి మంత్రిత్వమే చేతికి వచ్చినప్పుడు మఱి యేమి చేయుటకు వెనుదీయుదురు ? కనుక సాంకర్యమును సంపూర్తిచేయుటకు సన్నకట్టిరి. తొలుదొలుత మలబారులో హరిజనులు దేవాలయములలోఁ బ్రవేశించుటకు బిల్లు ప్యాసుచేసిరి. కాని యాయుళ్ళయాళము కాలికట్టుజమీందారగు జామరన్‌గారివంటి సనాతనమత సముద్ధరణదీక్షాబద్ధకంకణులచే సమలంకృతము. గురువాయూర గొప్ప గొప్ప కాంగ్రెసునాయకులు వచ్చి కోలాహలమొనరించినను త్మ్రమరవీధిని జండాలురఁ బ్రవేశింపనీయని సాహసి జామరన్‌గారు. మఱియు నమ్మలబారున హరిజనదేవాలయ ప్రవేశము నాఁగుటకుఁగా సంఘములుగాఁజేరి చాలమంది సంచరించుచున్నారు. అందువలన నాపప్పు లక్కడ నెక్కువగా నుడుకుటలేదు. పాలకాటిలోఁ బలువురు పంచములు ప్రవేశించిన మరల నట్లుచేయకుండుటకై పతియల్ శంకరన్ నాయరుగారు డిస్ట్రిక్టుమునసబుకోర్టులో దావావేసి యింజక్షనిప్పించియున్నారు. కాని మహత్తరమైన మధురమీనాక్షీదేవాలయములో మనకాంగ్రెసువారు మాయచేసి మాలలఁ బ్రవేశపెట్టినందులకుఁ జాలఁ జింతిల్లవలసివచ్చినది. సనాతనమతస్థులు చాలఁ జింతిల్లుచుండఁ గాంగ్రెసువారు కరమానందించుచున్నారు. అందుఁ బ్రధానామాత్యులైన రాజగోపాలాచార్యులుగారి యానందమునకు మేరయే లేదు. కృష్ణ మున్నగు ననేకపత్రికలలో నాచార్యులుగారయ్యానందము నగ్గలము ప్రకటించియున్నారు. బహుప్రయాసపడి ప్రధానామాత్యులైనందులకు బహుప్రజారంజకముగాఁ బరిపాలన బాగుగానుండవలెఁ గాని సర్వసంకరము సల్పి సనాతనమతస్థుల నేడిపించుటా కావలసినది? శ్లో॥ సంకరో నరకాయైవ కులఘ్నానాం కులస్యచ. రాజగోపాలాచార్యులుగారేమి? రాజ్యాంగమంత్రులైన మఱికొందఱేమి ? భరతవర్ష పరిపాలనభారము వహించినపు డనాది సిద్ధములగు నాఖండపు టాచారములయభివృద్ధికిఁ దోడుపడవలె. దానికి మాఱుగాఁ దన్మూలచ్ఛేదమునకే తలపడుచున్నపు డిది పూర్వపుఁ దురుష్క ప్రభుత్వము నేల

స్మరింపఁజేయదు? వారు గుళ్ళు కూలఁగొట్టినారు. వీరు గుళ్ళలోఁ జండాలురఁ బ్రవేశ పెట్టుచున్నారు.

ద్వివిధకార్యములును దేవతాపూజకు భంగముగలిగించునవియే, కనుక మ్లేచ్ఛ ప్రభుత్వముతోపాటు కాంగ్రెసుప్రభుత్వమును దేవాలయధ్వంసకమే కాని వేఱుకాదు. వారలు బ్రాహ్మణాది భారతనారుల బలాత్కారముగా భార్యలఁజేసికొనిన వీర లెవనిపై నిచ్ఛవొడమిన వానిఁ బెండ్లాడుటకును మరల నెప్పుడు వానిపై ననిష్ట ముదయించిన నప్పుడ విడనాడుటకును యథేచ్ఛావిహార మీయఁజూచుచున్నారు. అగ్నిష్టోమాదుల నాచరించువారే లేరుకదా! ఏటివేఁటనటుల నెవ్వరేని యొక్క రీక్రియకుఁ గడంగిన ననుదినము మార్కెటులలో నగు ననేకసహస్రపశువిశసన మాపలేకున్నను నిందగు విధి చోదిత పశువిశసన మాపుటకు వేనవేలు ప్రోఁగగుచున్నారు. అసహ్యాకరాపవిత్ర కార్యము లనేకము లాచరించుచున్నారు. అజాదికముల హరించుచున్నారు. అవాచ్యము లాడుచున్నారు. ఆఖరుకు యజ్ఞములు జరుగకుండ నాపుచున్నారు. తురుష్కులుగూడ నవనీసురక్రియమాణయజ్ఞములపట్ల నింత యపకృతి కావించియుండినటు లాకర్ణింపము. కాని రాక్షసు లీపనులు చేసినట్లు రామాయణాదులలోఁ జదువుచున్నవారము. హిందూదేశ మిట్టి రాక్షసకృత్యములు చేయు కాంగ్రెసువారి యేలుబడిలోకి వచ్చుట కిహసౌఖ్యకాములు నేఁడందఱో సంతసించినను నేఁడుచువారుగూడ నెక్కువగనే యున్నవారు. కావున సనాతనధర్మరతులగు జను లెల్లరు సంఘములుగాఁ జేరి శాసనోల్లంఘనమునకు సమకట్టవలెను. దేశమంతటం దిరిగి సభలలో నుపన్యసించి స్వధర్మమున జనులకు శ్రద్ధగలిగించుచు సనాతనమతవిరుద్ధమగు కాంగ్రెసువారి సలహాలను సర్వథా ఖండింపవలయును. ఇట్లు గాఢప్రయత్నమునకుఁ గడంగనిచో హిందూదేశ మింకను జెడిపోఁగలదు. ఇహపరదూరము కాఁగలదు. మధురమీనాక్షీదేవాలయమే మాదిగెల పాలయినదే మనమింక నేమిచేయఁగలమని మనవారు నిరుత్సాహపడఁగూడదు. ఆదేవాలయములో నంత్యజప్రవేశము మాయఁబన్ని చేసినది కాని మంచిమార్గముచేఁ గాదు. ఎల్లెడ నిట్టిమోసము సాగనేరదు.

శ్రీరంగమున శ్రేష్ఠులందఱుం జేరి హరిజనదేవాలయప్రవేశముపై నసమ్మతిని బ్రకటించిరి. ఇండిమ్నిటీబిల్లు రద్దుపఱచనియెడలఁ గాంగ్రెసుప్రభుత్వమువారు కలిగియున్న ప్రజావిశ్వాసమును దొలఁగఁద్రోసికొనెదరని తెలిపిరి. కుంభకోణశంకరాచార్య మఠములో సనాతనమతనాయకులు చాలమంది సమావేశమై భావికార్యక్రమమును గూర్చి పర్యాలోచించుచున్నారు. శంకరాచార్యులవారును జాల శ్రద్ధవహించుచున్నారు. చెన్నపట్టణవాసులగు కే. బాలసుబ్రహ్మణ్యయ్యరుగారు కే. వి. కృష్ణస్వామయ్యరుగారు మధుర నటేశయ్యరుగారు మొదలగు ప్రసిద్ధులు శంకరాచార్యులవారితో సంప్రతించుచున్నారు. వైస్రాయిగారికి నివేదింపఁదలఁచిన దరఖాస్తుతో సంతకములు చాలఁ జేయింపఁబడుచున్నవి. తిరుపతి దేవస్థానసంఘమువారు తిరుపతికొండ పవిత్రతను ప్రభుత్వమువారు గూడఁ బ్రథమమునుండి యొప్పుకొనుచుండిరి కావున హరిజనులు కాని యన్యక్రైస్తవులుగాని మహమ్మదీయులుగాని మీఁది కెక్కనే కూడదని హరిజన

దేవాలయప్రవేశము నత్యంతము గర్హించుచు నొక తీర్మానమును బ్రవేశపెట్టిరి. యస్సు కాంగ్రెసుప్రసిడెంటు యస్ శ్రీనివాసయ్యంగారు ప్రభుత్వము మతవిషయములలో జోక్యము కలిగించుకొనుట మహానర్థకరము కావున దౌర్జన్యముచేఁగాని శాసనసభల ద్వారమునఁగాని బొత్తిగాఁ గల్పించుకొనరాదనియు నీవిషయములోఁ జేసిన శాసనములను నేను గర్హించుచున్నాననియుఁ బ్రార్థనజరుపుటకే దేవాలయములు స్థాపింపఁబడినవి కావున రాజకీయకారణములచేఁ బ్రవేశముచేయించుట కేవల నిరర్థకమును దేవాలయపవిత్రతకే భంగకరము ననియు నిప్పటి పంచమప్రవేశమునకు రాజకీయములే కారణములు కాని ప్రజలలోని సహజమగు మతాభిమానము కాదని సులభముగాఁ దెలియఁగలదనియు నిట్టిమార్పులవలన దైవప్రార్థనయే నశింప మొదలిడుననియుఁ బోలీసు సాయముతోఁ బ్రవేశింపఁజేసిన వారికి దేవతాభక్తి యెట్లుకుదురుననియు నిది పరిహాసాస్పదమగు తెలివితక్కువయనియు నభిప్రాయమిచ్చిరి.

నేపాల్ మహారాజు శ్రీయోధరామేశ్వరజంగు బహదూరురాణా జి. సి. యస్. ఐ., జి. సి. ఐ. ఇ. గారు దేవాలయముల పవిత్రత కాపాడుట హిందువుల ధర్మమైయున్నదనియు హరిజనప్రవేశము జరుగనీయరాదనియు నభిప్రాయమిచ్చిరి. మెడ్రాసు రాష్ట్రీ వర్ణాశ్రమస్వరాజ్యసంఘమువారి యాజమాన్యమునఁ డ్రిప్లికేనులో జరిగిన యాస్తికస్త్రీసమావేశమునం దధ్యక్షతవహించిన శ్రీమతి యమ్.యే జానకి యడ్వకేటు వారు ప్రభుత్వమువారు ప్రవేశపెట్టిన దేవాలయపు ఇండెమ్నిటీబిల్లుపై స్త్రీలసమ్మతి ప్రకటించుచు గొప్పయాందోళనచేసి ధర్మకర్తలు దేవాలయముల హరిజనులకుఁ దెఱవకుండున ట్లొత్తిడికలుగఁజేసినచోఁ బ్రభుత్వమువారి యుద్దేశము నెఱవేఱదనియు సాంఘికవిషయములలోఁ బురుషుల కెట్టిహక్కుగలదో స్త్రీలకుఁగూడ నట్టిహక్కే యున్నది కావునఁ దగు నుత్సాహముతో దేవాలయశాసనమును దిరస్కరింపవలెననియు హెచ్చరించిరి. మధురాపురజనులుకూడ మాదిగెలచే నపవిత్రముచేయఁబడిన మహాదేవాలయమును మరలఁ బవిత్రముచేయు ప్రయత్నము మానుకొనలేదు. దేవాలయకోశాధికారి రాజీనామాయిచ్చినాఁడు. దేవాలయప్రవేశశాసనము మున్నగు నన్నిటిపైఁ దీవ్రమగు నసమ్మతిని దెలుపుచు మీనాక్షీసుందరేశ్వరవిగ్రహముల పునస్సంప్రోక్షణజరుపుటకుఁ బూనుచున్నారు. మరల మాదిగెలు ప్రవేశింపకుండ మంచి కట్టుదిట్టములతో మనుచున్నారు. వేయేల ? శాసనోల్లంఘనమునకు సమకట్టి సత్యాగ్రహసమరమును సల్పుచున్నారు. కనుక నోభారతీయులారా ! నిరుత్సాహులుగాక యెల్లరును నడుములు కట్టి యీదేవాలయప్రవేశశాసనముల నెంతయు నుల్లంఘింపుఁడు. తద్ధ్వంసమునకుఁ దగు ప్రయత్నములు కావింపుఁడు. భగవత్సేవ పచరింపుఁడు. మంత్రములకు మామిడికాయలు రాలునాయని మనములలో ననుకొనకుఁడు. చూడుఁడు. ఎప్పుడో కాక యిప్పుడే (9-8-39) సింధురాష్ట్రప్రభుత్వమువారు తమదేశమున బొత్తిగా వర్షములు లేక క్షామము చనుదెంచుచుండుట సమీక్షించి విద్వదుక్తవిధమున వరుణజపాదులఁ గావించుటయు మిక్కిలి వర్షములు కురిసినవఁట. కాఁబట్టి శారదాశాసనము హరిజన దేవాలయప్రవేశశాసనము మున్నగువాని రూపుమాపుటకై వ్యావహారికముగానే కాక పరమేశ్వరప్రార్థనా జపతపోహోమాది పారమార్థికముగాఁగూడఁ బ్రయత్నించి సనాతనధర్మోద్ధరణసల్పుటకు సంప్రార్థ్యమానులరు.

హైదరాబాదు, అల్లరులు

హైదరాబాదు యావనరాజధానియే యైనను స్వతంత్రము గాక యిండియా చక్రవర్తిక్రింది సామంతరాజ్యమగుటనో మహీపతులు మహబూబుపాదుషావంటి మంచి వారే యగుటనో ముందటి తురుష్కప్రభుత్వములవలె హిందువుల నెక్కువ కష్టపెట్టక చక్కగనే పరిపాలించుచున్నది. అందును బ్రస్తుతప్రభువులగు మ. ఘ. వ. నిజామ్‌గారు రాజ్యమంతటం బ్రాజ్యసౌకర్యములు గలుగఁజేసి ప్రజాహృదయములకుఁ బరమసంతోసము గలిగించుచున్నారు. ఇట్లు ప్రభువు లెంతమంచివారైనను నెక్కువసంఖ్య గల హిందువుల కన్ని సౌకర్యములు కలుగఁజేయుచున్నను నాత్మీయమతస్థులగుట నత్యంతాభిమాన ముంచక తప్పక కాఁబోలు నఖిలశాఖలలోను నౌన్నత్యము యవనులకే యర్పింపఁబడుచున్నది. అర్పింపఁబడుఁగాక. అద్దాని కంత యంగలార్పవలసిన పనిలేదుకాని యిట్టియైహికములనే కాక యాముష్మికములలోఁగూడ నవ్వారికే యాధిక్యమిచ్చి యన్యుల దేవతాసేవనాదుల కడ్డుగలిగించుట యత్యంతము విషాదకరము. ప్రభువులు బహుకాలమునుండి తమపైఁ బఱపుచున్న పాక్షికదృష్టిని ప్రజలు సహించుచుండిరికాని నవనాగరికులు నవ్యపథము ద్రొక్క మొదలిడిరి. కాంగ్రెసు పార్టిప్రేరణచే జనులిట్లు సౌకర్యకాములై సత్యాగ్రహమారంభించుటయు జైళ్లకుఁ బంపి పంపి శతములు సహస్రములుగా జంకులేక చనువారి సాహసమునకు సంతోషించి మ. ఘ. వ. నిజాంప్రభువు వారు హిందువుల కిఁకఁగొన్ని సౌకర్యము లిచ్చిరి. రాజకీయసంస్కరణలు రచించిరి. ప్రకటించిరి. అవి యింకను బూర్తిగాఁ గార్యరూపము తాల్పనేలేదుకాని సద్యోపత్తసంస్కారములు సత్యాగ్రహమునకు జడిసియే కదా యనియు నవ్వాని యథాపూర్వముగా నుండనీయక సంస్కరించుటేలయనియు వీరికీసౌకర్యము లేలయనియు మహమ్మదీయులు మచ్చరించి హిందువుల నెంతయు హింసించుచున్నారు. సత్యము విచారించిన శతమునకు 88 మంది యీరాజ్యమున హిందువులే. అల్పసంఖ్యాకులమయినను మారాజ్యమున మాకే యున్నతపదవులు సౌకర్యములు రాజకీయముననే కాక మతవిషయమునఁ గూడ నుండవలసినదాని కేమో చేసిరని హిందువుల హీనస్థితిలోనే యుంచక యేల యీసంస్కరణలని యవను లగ్గలము నల్లరిచేయుచున్నారు.

కాలగతి

(దంటు సుబ్బావధానులుగారు)

ఉ॥ కాలవశంబునన్ భరతఖండమునం గలదెల్లఁ జెల్లె. తా
త్కాలికలాభమందుచు స్వధర్మమువీడుచు వాడు చెందునున్
చాలక చాల లండికయి జాతియు నీతియు గోతిఁ ద్రోసి వా
చాలురు దుష్టశీలుర ప్రశస్తికినెక్కుచునుండి రక్కటా! 1

ఉ॥ ఎప్పుడుపుట్టినం జనిన నెవ్వని కందుల మేలు కీడహో!
గొప్పలకై జగాన గుమిగూడెడివారికిఁ గర్మభూమికిన్

తప్పనిశిల్పముల్ కళలు తత్త్వము ధర్మము నిల్పఁబెట్టఁగా
నెప్పుడుపుట్టు ధీరుఁడని యెంతు. తపింతు. జపింతు నెంతయున్ 2

మ॥ తలిదండ్రుల్ గురుదైవముల్ పగతురై దయ్యంబులై మ్లేచ్ఛులే
చెలులై చుట్టములై గురూత్తములునై చెల్లంగ నీనాఁడు మా
పలుకుల్ మీ చెవిముల్కులైపడుట యబ్రంబే? ఒకంతేని పె
ద్దలమాటల్ వినఁడన్న నేటికి వృథాధర్మప్రసంగాలిఁకన్ ? 3

చ॥ తెలుఁగుప్రబంధముల్ చదువు ధీరుఁడె లేఁడన సాంస్కృతంబులన్
తెలియుదురే? యథేచ్ఛముగఁ ద్రెంపుచు హద్దుల నెల్లభూములన్
కలయఁగఁజుట్టివచ్చెదరుగా కలికాలపుశీలవంతు లా
ప్తుల గణియింప రన్యుల ప్రభుత్వమునంగని భృత్యభావమున్. 4

ఉ॥ భృత్యు లమాత్యులైన మఱి భృత్యులెయైన నమాత్యు లిద్దఱున్
కృత్యము నిర్వహింప కెదియే నొనరింతురు స్థానశక్తిచే
నృత్యముసేయుచుందురు పయినేతల చేఁతల జాడ. మ్లేచ్ఛసాం
గత్యమునం గనుల్ చెడునుగా మఱి యెంతటిజ్ఞానికేనియున్! 5

ఉ॥ పుట్టుట తప్పుపో భరతభూమిని నేఁ. డెటో పుట్టెనేనియున్
పట్టుట తప్పు దేవగురుభక్తియు ముక్తియు వేదశాస్త్రముల్.
ముట్టుట తప్పు బాపఁడయి పుట్టియు సందె జపంబు. జందెమున్
పట్టుకయుంట తప్పు. భగవంతుఁ డెఱుంగు నిఁకెట్టులెట్టులో. 6

ఉ॥ బాపలె పాపులై జపతపంబులు మాని యెదేని పూనఁగా
ఏపనిసేయఁబూనరెవ? రేమిది సామి? ఇఁకేమి విద్య? లి
ద్వైపథమందు నిల్పఁదగు నేరిని ? తీఱనివ్యాధి వచ్చె నే
ప్రాపును లేనివేళ. భగవంతుఁడె దిక్కగు ధీరపాళికిన్. 7

చ॥ తన కులధర్మమున్ విడిచి దాస్యముఁబూనిన యాస్యసంభవున్
కనుటది ధాతవ్రాఁతయనికా కెటుసాధ్యము! దానినే మనం
బున సరిపుచ్చుకోఁగలుగు పుణ్యులు పుట్టిననాఁ డిఁకెంతకై
నను దిగిపోరె భారతులు? నాఁటికి నేఁటికి నేటిసాటియో? 8

ఉ॥ రేపటిచింతలేకయె చరింతురు గౌరవమొంది ధీరులై.
బాపలెయైన నిస్పృహులు. పల్కినదెల్లను వేదతుల్యమై
భూపసమాజవంద్యులయి భూతిని గోరక శిష్యకోటి క
ధ్యాపనసేయుచుందుర ధరామరశబ్దము సార్థకంబుగన్. 9

సహృదయుని లక్షణము

కవిహృదయము తెలిసికొనువాఁడు సహృదయుఁడు. తెలిసికొనుటయే కాదు. తానును వానివలె సుఖదుఃఖము లనుభవింపవలె. కావ్యము చదువునపు డేవని కశ్రు రోమాంచాదులు కలుగునో వాఁడే సహృదయుఁడని యాలంకారికులు నిర్వచించిరి. రత్నమును జూచి విలువ చెప్పు పరీక్షకునివలె వాఁడు కవిత్వసారమును నిర్ణయించును. కొబ్బెరకాయలోని నీరు త్రాఁగినటుల వాఁడు కవిహృదయమును గ్రహించి మిగిలిన దానిని వదలివేయును. కవి కట్టి సహృదయుఁడు దొరకుటకంటెఁ బండుగయును నట్టి వాఁడు లేకుండుటకంటెఁ గష్టమును లేదు. సావధానచిత్తుఁడై భావనావ్యాపారమును వృద్ధిచేసికొనుట సహృదయునకు సాధన. అతఁడు కుశాగ్రబుద్ధియై విక్షేపములేని చిత్తములోఁ గావ్యమును బఠించును. ఎట్టి స్వల్పవిక్షేపమైన నతని నరికట్టఁగలదు. ఒక్క సూర్యకిరణము పోటోలుతీయు ప్లేటులను జెడఁగొట్టినట్లు క్షణకాలిక విక్షేపముకూడ నతనిని బహిర్ముఖుని జేయును. అంత సావధానముగానున్నచోఁ గవిహృదయమును బాగుగాఁ గ్రహింపఁగలఁడు. (దివ్యవాణి)

ఆంధ్రభాష – సంస్కృతసంబంధము.

(ప్రయాగ వెంకటరమణశాస్త్రిగారు)

భాషాశాస్త్రతత్త్వజ్ఞులు కొన్నినియమముల ననుసరించి యాంధ్రభాషను సంస్కృతజన్యము గానిభాషావర్గములోఁ జేర్చి యున్నారు. అట్లన్యభాషాకుటుంబమున జన్మించిన దయ్యును, మన తెనుఁగుభాష తనయక్కసెల్లెండ్రగు తక్కిన ద్రావిడభాషల వలెఁ గాక చిన్ననాఁటినుండియు దేవభాష యనం బరఁగిన సంస్కృతముతో ననఁగి పెనఁగి మెలఁగుచు వచ్చినది. ఎల్లబాసలకుఁ దల్లియనఁదగు నాభాషామతల్లియుఁ దనకన్న బిడ్డలకన్న మిన్నగా మన్నించి యీభాషాబాలికకు మాటలు మప్పినది; నడకలు నేర్పినది; దోషములు తొలఁగించినది; గుణములు కూర్చినది; అలంకారము లొసంగినది; సద్వృత్తులలవఱిచినది; ఉచితరీతు లుపదేశించినది; పాకముల పరిచయ మొదవించినది. వేయేల? తనజీవితము దారవోసి, సర్వవిధములఁ దనయంతదానిం జేసినది. కన్నమోహము కన్నఁ బెంచిన ప్రేమ హెచ్చు. ...

ఆర్యు లార్యావర్తమునుండి దక్షిణాపథమునఁ బ్రవేశించినతఱి వింధ్యపర్వత పరిసరవాసు లయిన తొల్లింటియాంధ్రు లాయయ్యలతో నెయ్య మొనరించి, యొయ్యయొయ్యన వారు మాటాడు గీర్వాణభాషనుండి యున్న వున్నటులు కొన్నియుఁ, గొంత మార్పుతోఁ గొన్నియు లెక్కకు మిక్కిలియగు పదములు కైకొని తమమాటలతో మేళగించి భాషాభివృద్ధి గావించుకొనిరి. ఈయొక్కయంశమే యనన్యాదృశమైనయాంధ్రుల గుణగ్రహణపరాయణత్వమును, ననుకరణకౌశలమును, శతముఖములఁ జాటుచున్నది. అట్లు వా రార్యభాషాపదముల నలవఱుచుకొనుటయకాక యంత శ్రుతిరంజకంబులు కాకుండుటంబట్టి కావలయును దమభాషయందలి తత్పర్యాయపదములు కొన్ని వాడుట బొత్తిగ మానివేసిరి. 'మనుష్యుఁ' డను సంస్కృతపదము తక్క జన

సామాన్యవాచకమైన యాంధ్రపదము వాడుకలో లేకుండుటయే యిందుకు నిదర్శనము. 'మానిసి' యనునది తద్భవరూపము, 'మనిషి' గ్రామ్యము. ఇట్లే దేశము లోకము మున్నగు సంస్కృతసమములే వ్యవహారమం దున్నవి. తత్పర్యాయదేశ్యపదము లంతరించి నవి. దిగ్వాచకములలోఁ దూర్పు పడమర పదములే యాంధ్రము లున్నవి. ఉత్తరము, దక్షిణము సంస్కృతసమములు. ఇట్టిసామాన్యవిషయములం దెల్పుపదములే యాది నాంధ్రభాషలో లేకుండె నన వచ్చునా ? ప్రాచీనులు వానిని విస్మరించి యుందు రని చెప్పక తప్పదు. కొన్ని సంస్కృతశబ్దములకుఁ బర్యాయపదములు దేశభాషయందు లభించుచుండినను, దఱచుగ మనవా రిప్పుడును సూర్యుఁడు భూమి యాకాశము, పుణ్యము పాపము లాభము నష్టము దీపము కోపము నయము భయము కాంతి శాంతి ధాన్యము మాన్యము మొదలగుసంస్కృతసమములనె వాడుచున్నారు. సామాన్య సంభాషణమందు సైత మిట్టిపదములు నూటికి ముప్పదికంటె నెక్కువగ దొరలుచుండు నని తజ్ఞులు తలంచుచున్నారు. ఇప్పటివఱకుఁ దెనుఁగు నిఘంటువులలో నుత్తమ మనఁ దగిన శబ్దరత్నాకరమందు సేకరింపఁబడిన 35055 పదములలో 14814 సంస్కృతసమము లున్నవని మ॥ రా॥ రా॥ చిలుకూరి నారాయణరావుగారు లెక్కించి చెప్పియున్నారు. ఇవిగాక ముఖ మృగ చంద్ర సముద్రాది శబ్దములకు బదులుగ మొగము మెకము చందురుఁడు సంద్రము మొదలగుమాటలు పెక్కు లాంధ్రమున కెక్కి యున్నవి.

మఱియు, క్రీస్తుశకమునకుఁ బూర్వ మించుమించు చిన్నూ ఱేండ్లకుముం దాంధ్ర రాజు లీదేశము నాక్రమించుకొని రమారమి నన్నూ ఱేండ్లు రాజ్యము చేసిరి. ఇప్పుడు ధరణికోట యనఁబడుచున్న ధాన్యకటకము వారిరాజధానియైనను వారికిఁ బ్రధాన వాసస్థానము పాటలీపుత్రము. మతము బౌద్ధమతము, భాష గీర్వాణభాషకుఁ బ్రథమ పుత్రిక యగు ప్రాకృతము. ఈకాలమున రాజభాష యగుప్రాకృతమునుండి దేశభాష లోనికి యథాశ్రుతముగఁ గొన్నియు నీషద్భేదముతోఁ గొన్నియు సంక్రమించి యేవి తద్భవములో యేవి దేశ్యములో నిర్ణయించుటకుఁ బండితులు సైతము తబ్బిబ్బు పడు నంతటి యైక్యమును బొందిపోయినవి. దీనికిఁ దార్కాణముగఁ జిన్నయసూరి దేశ్యమున కుదాహరణముగ నూరు పేరు కోట పేట మొదలగు పదముల నుపయోగించి యుండ బహుజనపల్లి సీతారామాచార్యులు ప్రౌఢవ్యాకరణములో కోట పేటలు వైకృతంబులని సూత్రించియున్నారు. సీతారామాచార్యులు తద్భవము లని తెల్పిన వానిలోఁ గొన్నిటిని గొందఱు పండితులు దేశ్యము లనుచున్నారు. మన కిప్పు డాచర్చతో నంతపని లేదుగాని మనము తెలుఁగు (దేశ్య) పదము లనుకొనువానిలో సైతము సగముకంటె నెక్కువగా సంస్కృతజన్యములో తజ్జన్యజన్యములో యైనపదములే యగపడుచున్నవి. చిత్తగింపుఁడు.

మన కుగ్గుపాలతో నలవడిన యక్క తాత యమ్మ మామ బావ వదిన మొదలగు మాటలు వరుసగా నక్కా తాతః అంబా మామకః వధూ నీత్యాది సంస్కృతశబ్దములనుండి వెలువడినవే. గృహోపకరణాది వాచకము లగు మంచము కంచము ఉగ్గము పగ్గము జల్లెడ రోఁకలి వత్తి కత్తెర సెమ్మె నిచ్చెన కుండ పెట్టె మున్నగు పదములును నత్యంతపరిచితము లగుమృగపక్ష్యాదులం దెల్పునట్టి కుక్క గొఱ్ఱె కాకి గ్రద్ద గోరువంక పావురము చింత పొన్న పోఁక జమ్మి మల్లె జాజి కాఁకర పొట్ల అడవి కొండ గట్టు పుట్ట బావి దారి మొదలగు పదములన్నియు సంస్కృతసంబంధమును బడసినవే.

మనుష్యజాతి వాచకములలోఁ గుమ్మరి కమ్మరి గొల్ల మాల మాదిగ మున్నగునవియుఁ గృష్యాద్యుపయుక్తము లగు నాఁగలి కావడి గొడ్డలి మొదలగునవియు ధాన్యవిశేషవాచకము లయిన సజ్జలు కొఱ్ఱలు సెనగలు చామలు మున్నగుశబ్దములును గాలవిశేషవాచకము లగు గడియ జాము రేయి వేసఁగి పొద్దు (సూర్యవాచకమును) లోనగునవియు శరీరావయవవాచకము లయిన చెవి బుజము గోరు జుట్టు మొదలగునవియు లోహవిశేషవాచకము లయిన యిత్తడి రాగి కంచు మొదలగునవియు భక్ష్యాదివాచకము లయిన యుక్కెఱ చక్కెర వడియము విడియము విశేషణములలోఁ బెద్ద దిట్ట మున్నగుపదము లన్నియు సంస్కృతమునుండి వచ్చినవే. జీవనాధార మగు జలమును దెల్పునది నీ రనుతద్భవపదము గాక దేశ్య మేదీ ? మనము తఱచుగ నుపయోగించు నేయి మజ్జిగలు సంస్కృతసంబంధమును బడసినవే. మాటలు రానియీడుననే మనకుఁ బరిచితుఁడయినచందమామయైనను సంస్కృతమును విడనాడలేదు. ఇట్టితద్భవపదములును మనభాషయం దించుమించుగ నాల్గువేలున్నవి. ఆంధ్రరాజులకాలమందుఁ బ్రాకృతపదములును చాళుక్యరాజుల కాలమందు సంస్కృతపదములు (తత్సమములు) నాంధ్రమున కవతరించిన వని భాషాచరిత్రకారులు పలుకుచున్నారు. ఈ సంస్కృతప్రాకృతముల పొందికవలననే తెలుఁగుభాష రత్నములు చెక్కిన చొక్కపుబంగారు వలె మిక్కిలి చక్కనయి తక్కినబాసల నెకసక్కెమాడుచు 'దేశభాషలందుఁ దెలుఁగు లెస్స' యనెడి యుత్తమప్రశస్తి గాంచఁ గలిగినది. ఈక్రింది పద్యములందు సంస్కృతాంధ్రపదము లెంతయందముగఁ బొందుపఱుపఁ బడినవో చూడుఁడు.

ఉ "సంతతమైన సర్వసుఖసంపద గల్గియు దాసికిం దగన్
సంతతి లేమిఁ జేసి యది సర్వము హేయముగాఁ దలంచి ని
శ్చింతుఁడనై ధృతిం దపము సేయఁగ వచ్చితిఁ బుత్రజన్మ మా
నంతకు నేను మీదయఁ గృతార్థతఁ బొందుదు సన్మునీశ్వరా." భా. స.

ఉ. పంబిన కోపముల్ సమయభంగభయంబును నగ్గలించి యు
ల్లంబు పెనంగొనంగఁ బతులం దగ సభ్యులఁ జూచుమాడ్కి రూ
క్షం బగుచూడ్కి నాద్రుపదుకన్నియ సూచి సభాజనప్రతా
నంబును మత్స్యనాథుఁడు వినంగ నెలుంగు చలింప నిట్లనున్. భా. వి.

చ. తగియెడువేళలందు నియతంబుగ మజ్జనభోజనక్రియల్
తగ నొడఁగూర్తు భర్తలకు ధాన్యధనంబులు రిత్తమై వ్యయం
బగుటకు నోర్వ నెప్పుడు గృహస్థలభాండవిశోధనంబు లి
మ్ముగ నొకనాఁడు నేమఱఁ బ్రమోదముసల్పుదు బంధుకోటికిన్ భా. ఆ.

ఈ విధముగ నాభాషామతల్లి మన భాషకు ముద్దులుగులుకు పలుకులు చెప్పినది.

...క్రీ. శ. తొమ్మిది పదిశతాబ్దములలోఁ జాటులే యనఁదగు నక్కరలు మొదలయిన పద్యములు మాత్రము కలిగి యాంధ్రకవిత మిగుల బాల్యావస్థయం దుండె....

శ్లో॥ 'వాచా మాంధ్రమయీనాం యః ప్రసక్తా ప్రథమోఽభవత్,
ఆచార్యం తం కవీంద్రాణాం వందే వాగనుశాసనమ్.'

అను నార్యోక్తి చొప్పున సంస్కృతమునకు వాల్మీకివలె నాంధ్రమున కాది కవి యగు నన్నపార్యుఁడు తనయుభయపాండిత్యప్రకర్షము మెఱయ సంస్కృతమునుండి తత్సమపదము లేర్చికూర్చినట్లే మనోహరము లయిన వృత్తములు సైతము సేకరించి మన బాసకు మంచినడకల నలవఱిచెను.

కొందఱు వృత్తములు సంస్కృతమునుండి తెలుఁగునకు వచ్చినవి కావు; ఆంధ్ర కవిత్వమున కన్నఁ దొమ్మన్నూఱేండ్లు ప్రాచీనమై క్రీ. శ. 138 ప్రాంతమున సమంత భద్రునిచే సారస్వతారంభమును గన్న కన్నడమునుండి నారాయణభట్టు తోడ్పాటు వలన నాంధ్రమున కవతరించిన వని చెప్పుచున్నారు. ఆ కన్నడము కన్నను బ్రాచీన తరమై యెల్లరకును దల్లియిల్లయిన యార్యసారస్వతమునుండి కర్ణాటులు కైకొన్నట్లే యాంధ్రులును వివిధ విషయములతోపాటు వృత్తములను సైతము సంగ్రహించి రని చెప్పుటయే యుక్తతరము. తండ్రియాస్తిలోఁ దనయు లందఱకును స్వత్వమున్నది. సంస్కృతమునఁ బరినిష్ఠితము లయిన పృథ్వీ శిఖరిణీ శార్దూలవిక్రీడిత పంచచామర స్రగ్ధరా మాలినీ తరళాదులు సంస్కృతకర్ణాటాంధ్రములం దేకనామముతో నొప్పి యుండుటయు సంస్కృతమందు నిరూపితములు కాని యంబురుహము మత్తకోకిల మానిని కవిరాజవిరాజితము మున్నగువృత్తములు కర్ణాటాంధ్రములందు విభిన్ననామము లయి యుండుటయు మన యభిప్రాయమును బలపఱచుచున్నవి. అంబురుహవృత్తము నకు నాగరంజిత యనియు, మత్తకోకిలకు మల్లికామాల యనియు, మానినికి వనమంజరి యనియుఁ గవిరాజవిరాజితమునకు హంసగతి యనియుఁ గన్నడమున సంజ్ఞలు. కన్నడమునుండి కైకొన్నచోఁ గొన్నిటి కేకనామములును మఱికొన్నింటికి భిన్ననామములు నేర్పఱచుటకుఁ గారణ ముండదు. అట్లని ద్రావిడకర్ణాటభాష లాంధ్రకవిత్వమున కెట్టి తోడ్పాటు నొసంగలే దని నా యభిప్రాయము కాదు. కవితాకన్య కమూల్యాలంకారము లనఁదగు యతిప్రాసనియమములు వరుసగా నా రెండుభాషలనుండి వచ్చినవే.... తిక్కనసోమయాజి విరాటపర్వమందు

సీ. లలితంబు లగుమట్టియల చప్పు డింపార
హంస కైవడి నడ నల్లవచ్చి
ఎడ మేనినెత్తావి సుడియంగఁ బయ్యెద
పగము దూలించి పైమగుడఁ దిగిచి
సోలెడు నెలదీఁగె లీలఁ గ్రాలుచు వింత
చెలువంబు దలకొనఁ జేరి నిలిచి
తెలికన్నుఁగవకు నెచ్చెలివైన లేఁతన
వ్వ్వొలయంగ సరసంపుఁబలుకు పలికి
మెఱయు చెయ్యోల రాగంబు మెయికొనంగ
నెడఁద సొగయించు మాటల నెలమి మిగుల
నిన్ను ననురక్తిఁ గొలుచు నన్నెలఁత లుండ
నీరసాకార సైరంధ్రిఁ గోరఁ దగునె ?

అని శృంగారరసము నెంతయింపుగఁ గూర్చినాఁడో చూడుఁడు.

కరుణరసమును వర్ణించు సందర్భమున శ్రీనాథకవి.

సీ. తల్లి మదేకపుత్త్రక పెద్ద కన్నులు
గాన దిప్పుడు మూఁడుకాళ్ళ ముసలి
యిల్లాలు గడుసాధ్వి యేమియు నెఱుఁగదు
పరమపాతివ్రత్యభవ్యచరిత
వెనుక ముందఱ లేద నెవ్వరైన చుట్టాలు
లేవడి యెంతేని జీవనంబు
కానక కన్నసంతానంబు శిశువులు
జీవనస్థితి కేన తావలంబు
కృపఁదలంపఁగదయ్య యోనృపవరేణ్య!
అభయ మీవయ్య యోతుహినాంశువంశ!
కావఁగదవయ్య యర్థార్థికల్పశాఖి!
నిగ్రహింపకుమయ్య యోనిషధరాజ!

అని కైశికి వృత్తినే యవలంబించెను. ద్రౌపదీవస్త్రాపహారణఘట్టమున నన్నపార్యుఁడు క్రోధఘూర్ణితమానసుఁ డగుభీమసేనునిచే రౌద్రరసోజ్జృంభితము లయిన భీషణభాషణము లారభటీవృత్తి నెట్లు పలికించెనో వినుఁడు.

మ. కురువృద్ధుల్ గురువృద్ధబాంధవు లనేకుల్ సూచుచుండ న్మదో
ద్ధురుఁడై ద్రౌపది నిట్లుచేసిన ఖలుꣳ దుశ్శాసనుꣳ లోకభీ
కరలీలꣳ వధియించి తద్విపులవక్షశ్శైలరక్తోరుని
ర్ఝర ముర్వీపతి చూచుచుండ నని నాస్వాదింతు నుగ్రాకృతిꣳ.

ఇట్లు చాలవఱకు సంస్కృతవ్యాకరణ నిబంధనల ననుసరించినను గొన్ని యెడల నాంధ్రకవులు స్వాతంత్ర్యమును బూనకపోలేదు.

సంస్కృతము ననుసరించి 'నదీసుత' యని కావలసియుండ, 'నదిసుతగురుకర్ణశల్యనాగపురీశుల్' అని హ్రస్వశిష్టరూపమునకు సాధుత్వము కారికాబద్ధము గావించిరి. సంస్కృతమున "అక్షా దూహిన్యా ముపసంఖ్యానమ్" అనువార్త్తికము ననుసరించి, యక్షౌహిణీ, అనియుండఁ దెనుఁగున, నక్షోహిణి యనురూపము నంగీకరించి ఛందోబద్ధముఁ గావించిరి. సంస్కృతమున, "మృగనాభి ర్మృగమదః కస్తూరీ" అనియుండఁగా "శ్రీవక్షోజకురంగనాభ మెదపైఁ జెన్నొందు" నని పెద్దనార్యుఁడు కురంగనాభ మని యకారాంతముగాఁ బ్రయోగించియున్నాఁడు. సంస్కృతము ననుసరించి 'గృహయాళు' 'కావలసియుండ' పెద్దన 'యదిగ్రహయాళుభల్లుక' మని ప్రయోగించినాఁడు.

ఇట్టి విశేషరూపములతోఁ గూడ సమగ్రసంస్కృతపరిజ్ఞానము కలిగించు తత్సమవ్యాకరణగ్రంథమును రచియింపించి సాహిత్యపరిషత్తువా రాంధ్రభాష కోదవం దీర్చెదరుగాక!

———

ఇల్లాలు

మూడవ భాగము

3. వితంతూద్వాహము.

(మఱియొకనాఁడు మనకథానాయికయు నామె యత్తగారును నింకఁ గొందఱు స్త్రీలును జేరి సంభాషింపఁదొడంగిరి.)

జగ. అంబ:- కృష్ణా ! లోకములో నింతవింతసంగతులు పుట్టుచున్నవి విన్నావా ? 4 రోజులనాఁడు రాజమహేంద్రవరములో నాడదానికి 2వ పెండ్లి చేసినారఁట. ఈసంగతి యందఱు గుంపులు గుంపులుగాఁ గూడి మాటలాడుచున్నారు. ఆ కాలమునాఁడు లేని కష్టాలిప్పుడేమి వచ్చినవి ? దేశమంతట నీ తగవులు వెలసినవి దుమియా !

కృష్ణాబాయి:- ఇది మనవంటివారు నిర్ధారణచేయఁదగిన యంశము కాదు. దీనిం గూర్చి కొందఱు కూడుననియుఁ గొందఱు కూడదనియుఁ దుదముట్టని వివాదముల నొనరించుచున్నారు. ప్రతినియమమందు నాచారమునఁ గొంత మేలును గొంత కీడును గలదు. పనిగాని పదార్థముగాని నిరపాయమగునట్టిది లోకమున లేదనియే చెప్పనగును. జంతుజాలమునకు జలాశయము లుండుట యావశ్యకము. దానియందుఁ బడినవారి మరణమున కవియ కారణములగును. వంటచేసికొనుట కగ్గి నింటనుంచుట యవసరము. అది వస్త్రముల నంటినను నిండ్లనంటినను నాశన మొనరించును. ఇటులనే సమస్తపదార్థములు నుపయుక్తానుపయుక్తములై యొప్పుచుండును. మనదేశమునఁ గొంద ఱుత్తమజాతులవారు నింద్యమని తలంచి యిది వదలిరి. తక్కినజాతులవారిది యనుసరించుచున్నారు. ఇప్పటి మనదొరతనపు జాతివారికి మనవలెఁ గులభేదము లేదు. కాని సంబంధబాంధవ్యము లొనరించుకొనుటలోఁ గొన్ని కట్టుబాట్లు కలవు. వారును గౌరవాచారములందమ కసమానులగు వారిని బంక్తిభోజనముల నుంచుకొన నొల్లరు. ఇటులనుండినను వారు మనకులముల కట్టిలోటుపాటులు గలవని పరిహసించుచు నాక్షేపించెదరు. యథారాజా తథాప్రజా యనుమాట బూటక మేనాఁటికిఁ గాఁజాలదు. మన ప్రభుత్వమువారి కింగ్లాండున స్త్రీ పునర్వివాహ మాచరణీయమగుటచేత మనదేశమున నది కొన్నికులములవా రాచరింపకుండుట బహుఘోరమగుశాస్త్ర నియమమని తోఁచుచున్నది. ఆబాల్యము వారివిద్యలనే చదివినట్టియు మన శాస్త్రరహస్యముల నెఱుఁగఁజాలనట్టియుఁ దద్దేశాచారములను గ్రహించనట్టియు మనవారిలోనికొంద ఱీకార్యము మహోపకారముగ నెంచి సాధింపఁ గంకణము

కట్టుకొనియున్నారు. కాని శాస్త్రీయమతాచారములం దాఱితేఱి గానుగలం బడఁద్రోయఁబడి లక్షలకొలఁది మృతి నొందుటకును దలపన్నుల నిచ్చుటకును సహించియు మతము వీడఁజాలక వేల సం॥ లు కళంకరహితముగను దృఢముగను నిల్చినమనవారు నేఁటిమతసంస్కర్తలపొల్లుమాటలకు లోఁబడుదు రను మాట వట్టికల్ల.

జ:- ఇదిగోనే? ఆదేశములో వితంతువివాహా లున్నవికదా! విధవలు లేనేలేరా యేమిటి?

కృ:- మనదేశమునకంటె నధికసంఖ్యాకలు కలరు. ఆదేశములఘోరము లన్నియు వినిన మనయాచారము లంతకంటె వేయిరెట్లు మంచి వనిపించక మానవు. జనాభానుబట్టి మనచక్రవర్తిగారు నివసించులండనుపట్టణమున 16 లక్షలవితంతుస్త్రీ లున్నారని వినియున్నాను. వీరందఱును వివాహము చేసికొనుతలంపు కలవారలే యైనను వరులు దొరకుటమాత్రము సులభముకాదు. వితంతూద్వాహముల నిషేధము నొనరించువిధికంటెఁ దదంగీకారవిధివలననే దేశారిష్టములు మెండగును. దీని నంగీకరించినంతమాత్రమున నెల్లరు నావివాహము నొల్లనుజాలరు. అమెరికాదేశమున బ్రిటీషుకనడాయందీశాసన మిప్పటికి 150 వత్సరములకుఁ బూర్వమున నచటిప్రభుత్వమువా రంగీకరించిరి. ఆదేశము నింగ్లీషువారే పరిపాలించుచున్నారు. తత్పూర్వ మచటను వితంతూద్వాహములు గర్హ్యములుగా నెన్నఁబడుచుండెను. ఇట్టిశాసనము పరిపాలకు లంగీకరింపకమున్న తద్దేశవాసిను లగునవివాహితయువతు లిన్నూఱుమున్నూర్గురు చేరియాశాసనము నంగీకరింపక త్రోసిపుచ్చుఁడని విన్నప మంపికొని యుండిరి. వార లామనవిలో నవివాహితలు వందలకొలఁదివరులఁ బడయఁజాలక యాలమట చెందు నిక్కాలంబున వితంతూద్వాహము శాస్త్రీయ మొనరించుటచే వివాహసౌఖ్యముఁ గొంతకాల మనుభవించి పురుషవశీకరణమునం దాఱితేఱిన వితంతువులకే మఱలమఱల వివాహము లగుచుండుటయు ముగుద లనేక లవివాహితలుగనే మరణము నొందవలసినవా రగుటయుఁ గలుగఁగలదని వ్రాసికొని యున్నారు. ఉగ్గుపాలనాఁటినుండియు నిట్టియాచారములు ప్రబలియుండిన దేశములం బుట్టి పెరిఁగినమన దొరతనమువారి కిందలిలోపములు మనంబున కంటఁజాలవనుట వింతకాదు. అభ్యాసవిశేషము స్వభావముగ మాఱునని మన మందఱము నెఱుఁగుదుము. అలవా టధికమైనవారు దుర్వాసన గ్రహింపఁజాలరు. గింగురుమను ధ్వనుల వినఁజాలరు. అసహ్యము లగు లోపములం గనఁజాలరు. బహిరింద్రియములే యిట్లుండ బుద్ధి యుచితానుచితవివేచనశక్తి కలిగియుండుట కల్ల.

జగ:- ముక్కుండి వాసన తెలియకపోవుటయుఁ జెవు లుండి వినలేకపోవుటయుఁ గను లుండి చూడలేక పోవుటయు నేమిటి? నాకుఁ దెలియలేదు.

కృ:- అలవాటుచే నవి గ్రహింపఁజాలరు. ఉల్లియు నింగువయుఁ దినువారల కా వాసన తెలియదని యిదివఱకే చెప్పియుంటిని. అట్లనే కంచరపని చేయు

వానికిఁ దాను జేయుధ్వని వినఁబడదు. అలవాటులేని మనవంటివార మచట నొకగంటసే పుండినఁ జెవులు గింగురుమని నిలువలేకుందుము. వాఁడును వాని కుటుంబమువారును నది యభ్యాసవిషయమగుటచే నిశ్శబ్దముగ నున్నతీవలె ధ్వని కలుగుచుండినను సుఖముగ నుండఁగలరు; నిద్రింపను గలరు. మనము సహింప లేము. మాసిన గుడ్డలు కట్టి నలవడినవారు సమీపించిన మనము సహింపఁ జాలనంత ముఱికిగనుందురు. కొందఱియిండ్లును గడువాసి చీదఱగొల్పుచుండును. అవి కలవారల కవి యింపుగనే యుండును. కావుననే యభ్యాసము స్వభావ మగునని మనవా రనుచుందురు. ఈకారణబలముచేతనే వారి కీవితంతూద్వాహ నిరసన మింతకఠిన మనిపించుచుండును. ఇది మనదేశాచారమందుఁ బరిపాటి యైనతోడనే కన్యావివాహము లంతరించి రజస్వలావివాహములే ప్రారంభ మగును. ఇవి ప్రబలుటతోడనే యేఱుడు పిల్లల కాసుపత్రిలును వివాహ సంబంధవిమోచనకార్యస్థానములును నియమింపవలసియుండును.

జః- ఏమిటే వింతమాట లనుచున్నావు? ఏఱుడుపిల్ల లేమిటి? వివాహవిమోచనా లేమిటి? నాకుఁ గొంచెము విప్పి చెప్పు.

కృః- అత్తయ్యాగారూ! తీఁగ లాగినఁ బొద కదలునన్నట్లు విషయ మొకటి ముచ్చటించుచుండిన నాసంబంధము గలసంగతు లెన్నియో ప్రస్తావవశం దప్రయత్నముగ వచ్చి దొరలుచుండును. దేశాంతరాచారములఁ జక్కఁగఁ దెలిసికొనవలెనని నచో మన మాదేశముల కరిగి యచటిజనులతోఁ గలసిమెలసి కొంతకాలమైన నుండినఁగాని తెలిసికొనఁజాలము. అట్టిస్థితి మనము విని పట్టుకొన్నయొకటి రెండు మాటలతో సవిస్తరముగ నెఱుఁగఁజాలము. మొదట వినినప్పు డీవిషయము నాకు వింతగనే తోఁచి మరలమరల నడిగి తెలిసికొని కొలఁదిగ గ్రహింపఁగలిగితిని. ఏఱుడుపిల్ల లనఁగాఁ జాటుగఁ గని పాఱవేయఁబడినపసివాండ్రు. మనదేశమునం దధోగతియుండ లెచ్చటనైన నొకరు నూటికిఁ గోటికిఁ జాటుగఁ బిల్లలఁగని పాఱవేయునట్లు దేశమున వితంతువులును వివాహముకాని పడుచులును లజ్జాకర మగునీపని తఱుచుగ నొనరించెదరఁట. ఆదేశమునం గలవివాహము కాని యువతులును వితంతులై పురుషసాంగత్యసుఖము నెఱిఁగినప్రౌఢలును బురుషులం గలసి విహరింప ననువుఁ జనవుఁ గలిగియున్నారు. ఇంద్రియబలమునకు బుద్ధిబలము లోఁబడుట స్వాభావికమని మనఋషు లెఱిఁగియుండిరి. కావుననే మన వంటివారు సహేతుకముగఁ దెలియఁజాలనిధర్మము లనేకము నియమించి వానిని మనశాస్త్రములందు విధించియున్నారు. పడుచుతనంబున ముందుచూపు లేనిస్త్రీపురుషులు కలసిమెలసి తిరుగుచుండునవకాశ మున్నపుడు మహాఋషుల వంటివారు లోఁబడిరన మద్యమాంసఖాదు లగు వీర లింద్రియనిగ్రహము కలిగి యుందురనుట దూదిపింజలం దగ్నిస్తంభన మొనరించినట్టిదగుటకు సంశయము లేదు. మోహ మెట్టికార్యములఁ జేయింపదు? ఆఁకలి రుచి నెఱుఁగదు. నిద్ర సుఖము నెఱుఁగదన్నట్లు మోహము సిగ్గెఱుఁగదు. దినదినమును మన మది

వినుచున్నమాటలేకద ! అట్టివారికి గర్భోత్పత్తి యగుట వింత కాదు. వితంతువులుగనో యవివాహితలుగనో యుండిన వీరియంతర్వత్నీత్వము వెల్లడియైనచో ననంతరమున వీరికిఁదగుసంబంధములు కుదుర వనుట నిశ్చయము. ఈకారణముచేఁ గార్యాంతరమిషలం బన్ని స్థలాంతరముల కరిగి తమ్మెఱుఁగని నగరప్రాంతముల నివసించి మఱుఁగున బిడ్డంగని యొకచోట నునిచి రహస్యముగ స్వస్థలమున కరుగువారు వేనవే లుందురు. ఏటి తెచ్చి పెంచి పెద్దవారల నొనరించుటకు వేఱుగ నాదేశముల నాసుపత్రు లుండవలసినంత విరివిగ నట్లు పాఱవైచిన దిక్కులేని శిశువులు లభించెదరు. అమెరికాదేశమునం గలన్యూయార్కుపట్టణమునం గలయిట్టియాసుపత్రియందు సం॥ కు రమారమి 40 వేల శిశువులు చేర్చుకొనఁబడుచుందురఁట. ఇంగ్లాండులో నిప్పుడు యుద్ధము తటస్థించి యువజనులు సేనలోఁ జేరుటచేఁ దత్సంబంధిను లగునవివాహితయువతులు లక్షలకొలఁది గర్భవతులై యున్నారు. వారికి లక్షలకొలఁది శిశువు లుద్భవించుచున్నారు. వీరిగతింగూర్చి యాదేశమున నిప్పు డొకయాందోళనము వ్యాపించుచున్నది. అట్టివింత మనదేశమున నేకాలమునను గలుగకుండుఁగాత.

జః- [ఈమాటలు విని ముక్కుమీఁద వేలుపెట్టుకొని కొంతసేపు మాటలాడలేక ("ఇది నిజమై యుండునా ? వట్టిబూటకమా ? నమ్మ వీలులేకుండ నున్నదే ?") అని విభ్రాంతిపడి కొంతవడి యూరకుండి మరలఁ గొంతసేపటికి] "నీమాటలు విన్నకొలఁది వింతవుచున్నది. ఇంతలోనే యిన్ని యెట్లు నేర్చుకొన్నావా యనియు నెవరైనను జెప్పినారా ? లేక నీకై నీవే నేర్చుకొన్నావా యనియు నాలో నేనే యనుకొనుచున్నాను. నీమాటలు చూచినను నీయీడు సూచినను నా కాశ్చర్యము వేయును.

కృ:- అత్తయ్యగారూ ! ఇప్పుడు నేను జెప్పినదానిలో వింత యేమియున్నది ? నాకు 18 ఏండ్లు నిండవచ్చినవి. నాయీడు మగపిల్లలలో ఘనపాఠులుఁ దార్కికులు వైయాకరణులు నెందఱు కలరో చూడుఁడు. అంతదూర మేల ? నాయీడుకు బియే బియల్ ప్యాసయినవార లనేకులు కలరు. ఈపుక్కిటిపురాణములు 4 మాట లప్పుడప్పుడు వినుచుండినవి మనయుపన్యాసమంజరినుండి చదువుచుండినవి మీకు మరలఁ బ్రస్తావవశమునఁ జెప్పుటలో వింత యేమి కలదు ? కాలమంతయు వ్యర్థవ్యయ మొనరించుచుండు మనము దాని విలువ గనఁజాలముకాని యట్టి కాలమును మన మేదేనియొకపనియందు వినియోగించునలవాటు కలిగి యుండినచో నెంతెంతపనులు చేయఁగలదియు నెన్నిపుస్తకములు చదువఁగలదియుఁ దెలియఁగలదు. నేను మీకు వినిపించినవెల్లఁ జిన్నతనమునుండియు మానాయనగారు చెప్పినవి కొన్నియు నుపన్యాసమంజరినుండి చదివినవి కొన్నియు నై యున్నవి. ఇంతకు మించినపాండిత్యాధిక్య మేమి కలదు ? ఇప్పుడు విన్నమాట లితరులకుఁ జెప్పఁగలరు కద ! అవి విని మే మందఱము నాశ్చర్యపడవలసినదేనా ? ఇంతలో వింత యేమియు లేదు. విన్నమాటలు మరలఁ జెప్పుట యొకబ్రహ్మవిద్య గాదు.

అయ్యెడ నమ్మధుదనుజుం
ఁడయ్యమివరు చ్యవను పావనాంఘ్రులకుం దా
నొయ్యనఁ బ్రణతుల నొనరిచి)
అయ్యా! నే నెచటనుండు నానతియీవే. 169

కం. అనియడిగిన నయ్యనఘుఁడు
మనమునఁ దలపోసి యీక్రమంబుగఁ బల్కెన్.
విను. చౌర్యద్యూతసురా
వనితాది వ్యసనవర్గవాసివి కమ్మా. 170

వ. అని నియోగించిన వాఁడును నట్లుకావించె. శర్యాతిభూపకులావతంసుండు జామాత తపోవీర్యంబువలన యాగంబు సుప్రయోగంబై చెల్లెనని యనేకవిధంబులఁ గొనియాడి క్రతువున కేతెంచిన సకలజనంబులకు మృష్టాన్నం బొసంగి యవభృథానంతరంబున మౌనివారంబులకును దేశాధీశసంఘంబులకును భూసురసంచయంబులకును సర్వసత్కారంబులు గావించి వీడ్కొలుప వారలీజన్నంబు మున్నొనర్చిన జన్నంబులకన్న మిన్నయని యెన్నుచుఁ గ్రన్నన తమతమ దేశంబులకుఁ జనిరి. అశ్వి (నీ దేవత) లును గృతభాగులై చ్యవనమునీశ్వరునకు నమస్కరించి వీడ్కొని నిజేచ్ఛం జనిరి. విష్ణ్వీశ్వరాబ్జయోనీంద్రప్రముఖ బృందారకసందోహంబులు తమతమ మందిరంబుల కేగిరి. రాజేంద్రుం డధిక తేజస్సమేతుండై మెఱయుచుండె. అప్పు డా చ్యవనమునీంద్రుం డందఱు విన నీయాఖ్యానం బెవ్వఁడేని శ్రద్ధాన్వితుండై వినినను బఠించినను లిఖించినను మనోరథసిద్ధిం గాంచి యవసానంబున జరామరణ వర్జితంబైన కైవల్యంబు నొందునని యానతిచ్చి పత్నీసమేతుండై శ్వశురదత్తంబులగు ననేకమణిమయాభరణంబులు గైకొని నిజాశ్రమంబున కరిగి సకలశుభంబులు ననుభవించె నని సూతుండు శౌనకాదిమహర్షులకుం జెప్పె. 171

ఉ. సారససంభవాది సురసన్నుత దివ్యపదాంబుజాత! సం
సారవిదూర! ఘోరభవసంతమసప్రవిదారణార్కవి
స్ఫార! చిరత్నరత్నమయ చారువిభూషణభూషితాంగ! దో
స్సార నిరస్తదైత్యవర! సాధుజనావన! లోకపావనా! 172

క. వేదాంతవేద్య ! నిత్య
శ్రీదా ! సురమానిబృందసేవిత ! వరగాం
గోదంచితపాదాబ్జా !
శ్రీదయితా ! ద్వైవిత్యమత! శ్రీకంఠసుతా!

మాలిని. సకలదనుజశిక్షా ! సర్వమానీంద్రరక్షా !
శకలిత రిపుజాలా ! సాధుసంత్రాణశీలా !
ప్రకట రణధురీణా ! భామినీపంచబాణా !
ముకుటలలితశీర్షా ! భూసుతాసస్యవర్షా ! 174

—♦ గద్యము ♦—

ఇయ్యది శ్రీసీతారామచరణసేవాసమాసాదిత సరసకవితాధురం
ధర ఘనయశోబంధు రాపస్తంబసూత్ర శ్రీవత్సగోత్ర
పవిత్ర పిన్నెలి పేరయార్యపౌత్ర సీతారామాభి
ధాన సత్పుత్ర సుచరిత్ర నాగయాఖ్యకవి
ప్రణీతం బైన సుకన్యకాపరిణయం
బను మహాప్రబంధంబునందు
సర్వంబును
దృతీయాశ్వాసము.

—: విశ్వనాథము వృథాకలహములు :—

కం. ఈపనులన్నియు నే నితరదేశమున కేగినప్పుడు చేయించి యిల్లాలి నేడిపించు చుండుటయుఁ బాపము చచ్చి స్వర్గమందున్న యప్పటి కరణము చెన్నకృష్ణయ్య మగవాఁడులేనప్పుడు మగువను వగవఁజేయుట తగ దూరకుండుఁడని యిప్పటికరణమును బోలె నప్పుడు తన్నాశ్రయించి తిరుగుచుండువారైనను బక్షపాతము వహింపక బాగుగా మందలించెనఁట. మాసమునకో మాసార్ధమునకో వాసమునకు వచ్చితిని. జరిపిన పనిని శ్రవణించితిని. ఇంటిముందటి తూము నీక్షించితిని. ఎదియుం జేయుటకుఁ దోఁపక పదిదినములు పడియుంటిని. ఇంతలో మకరసంక్రమణ మరుదెంచెను. భోగి పండుగనాఁడు ప్రొద్దుపొడిచినది మొదలుకొని పార్వతీశము వంటయింటిలో నాయింటి ముందటికిఁబెట్టిన తూముదగ్గఱఁ బార్వతీశము విశ్వనాథము నుభయులయిండ్లలోని వారలు నభ్యంగనస్నానము లాచరించుట కారంభించిరి. కుంకుడునురుగంతయు వచ్చి పడి నాగృహసవిధభాగము పంకిలం బొనర్చెను. అయ్యంబువులచే ననహ్యమై యగపడియెను. ఆకోఁత యవలోకించి యాగ్రహము పట్టలేక తూముఁబూడ్చుట కదవఱకే తొందరపడు సతీసుతులఁ జప్పనఁ బూడుపుమంటిని. వారు ఱాలు రప్పలు గొట్టి రంధ్రముం బూడ్చివేసిరి. పార్వతీశము పాఱయొకటి పట్టుకొని బాజాఱునకుఁ బఱతెంచెను. కాలువపూడ్తునని గంతులువైచెను. నడుమునకు గుడ్డకట్టి నేను బూడ్చుము చూతమని పోరు ముందఱ నిలిచితిని. పూడ్తునని వాఁడును బూడ్పుమని నేనును వీరావేశముతో వివాదపడితిమి. బావలును బైపైని బాసటగం బ్రవర్తించిరి. ఇఁకఁగొంతసే పిట్లే నడచిన నేమగునో యెఱుఁగను గాని యింతలో నీసంఘర్షణము విని యస్మదగ్రజు నాత్మజు లాంజనేయులు రామలింగము నచ్చటి కరుదెంచిరి. వీండ్రు వచ్చుటతోడనే విశ్వనాథము వివాద మెరుఁగనీయక చల్లచల్లగా సర్దఁదొడఁగెను. చివర కీభాగ్యమున కపరాహ్నమైనను నన్నుమతినకుండ నుండవలయునా యని యాగ్రహోవ్యగ్రుఁడను నారక్తనయనుఁడను నైన నాహస్తము పట్టుకొని లేవ నరుదెంచెను. అంత శాంతిలి యంతఃప్రవిష్టుఁడనై యన్నముం దింటిని. పదంపడి పిడుగురాళ్ళనుండి చేబియ్యము నరసింహము చీరఁబడియెను. అప్పటి కింకను వాఁడు విశ్వనాథముతోడి వియ్య మందలేదు. మద్విషయమై యున్న కృతజ్ఞత మఱవలేదు. కనుక నితనితీర్మాన మిరువురకు నిష్టమయ్యెను.

విశ్వనాథము నింటికిఁ దూర్పున దొడ్డియుఁ బడమట భవనము నాకుఁ బరఁగుచున్నవి. ఆ కుడియెడముల రెండింటను గోడ లున్నవి. ఆగోడలు రెండు నాత్మీయముల యని యవ్వాని వాదము. అందుచేతనే నాకును హక్కుగలదని యనిపించుటకుఁ బడమటిగోడ కాన బాజాఱునకు నేను బందవేసియుంచుటయు నాపరోక్షమున వాఁడు దానిఁ ద్రవ్వివేయఁ దలఁపడుచుండుటయు. ఆగోడ యడుగుపుడమి యుభయములది. విశ్వనాథము పెట్టించెను. తూరుపుగోడ యడుగుస్థలముదగ్గఱనుంచి పెట్టించుట వఱకు నంతయు నాతుకూరు వెంకన్నదే. అట్టిగోడహక్కు దొడ్డితోపాటు నాకు సంక్రమించినది. కాని మధ్య మావాఁడు మాయ కొంత పన్నెను. పన్నినది ఫలింపకున్నను బట్టుమాత్రము విడువఁడు. దొడ్డిలోనికి మిద్దెగూనపెట్టినప్పుడు గూనపెట్టు

కొనుటకును గోడహక్కు తమకిచ్చుటకును వెంకన్న సమ్మతించినట్లు వెనుకటి తారీఖు వేయించి చినప్పయ్యయు జ్యేష్ఠపుత్రుఁడు వ్రాయించిరి. రికార్డులోఁ బడవేసిరి. కాని రిజిష్టరుకాని యాకాగితమును న్యాయాధికారులు నమ్మక బుట్టదాఖలు చేసి యున్నవారు. అయినను నదియే పట్టుకొని విశ్వనాథము వ్రేలాడుచున్నాఁడు. నరసింహ మిదియంతయు నెఱిఁగియున్నవాఁడగుటఁ బడమటిగోడ పెట్టుడు ఖర్చు విశ్వనాథముకు నాచే నిప్పించి యందలి హక్కుభయులదనుటయుఁ దూరుపుగోడహక్కంతయు నాదనుటయు న్యాయమైనను నీషద్ద్వేషమ్మున కేమి లెమ్మని యిరుగోడల నిరువురికి హక్కుండునట్లును బూడువఁబడిన పార్వతీశము వంటయింటితూము తిరిగి తెఱవకుండునట్లును వానివాకిలి కెదురుగ్గానుండు కాలువ గచ్చుతోఁ గట్టించునట్లును దీర్మానించెను. వాగ్వ్యవహారమే కాని వ్రాఁతపూఁత లేమియు జరుగవు. అనంతర మన్నదమ్ములు వేఱుపడినప్పుడు పారీఖత్తులో గోడలగొడవ చేరుపఁబడియెనఁట. చేబియ్యము నరసింహ మిట్లు చేసిపోయిన తరువాత మరలఁగొంతకాలము మంచిగనే యుంటిమి.

విశ్వనాథ మింతలో వివాహములు తలపెట్టెను. రాళ్ళభండి రాజయ్య కొడుకుకుఁ దనకూఁతు నిచ్చుటకు రాయబారములు జరిపెను. అత్యంతము యత్నించెను. కడకుఁ గట్నముదగ్గఱ నుభయులకుం గలియక యుపరమించెను. తల్లి వరుసదైనను దనయునకు దనమేనమామబిడ్డను పెండ్లిచేసెను. ధర్మశాస్త్రముతోఁ దనకుఁ బనిలేదనియెను. పెండ్లిండ్ల ప్రస్తావములు పెక్కండ్రతోఁ దెచ్చెను. అనేకులతో నాలోచించెనుగాని మాటమాత్రమైనను మనవాఁడు నాతో ననియెఱుఁగఁడు. పైసంగతులతోఁ బనియేమి? పప్పన్నమునకుఁ బిలిచెను. పోతిని. వాని స్వభావ మదియని యేనే సరిపెట్టుకొని యేగుచుంటిని. ఇంతలో జాతాశౌచ మొకటి వచ్చి యిరువురకును శాశ్వత శత్రుత్వమును సమకూర్చెను. జాత యడిగొప్పుల నివాసియుఁ ద్రిరాత్రాశౌచజ్ఞాతియు నగు జానపాటి నరసింహము బిడ్డ. అది పుట్టిన మూడవ దినముననే యాబ్దికాన్నభోక్తృత్వమునకు విశ్వనాథము వేడ్కపడియెను. జాతాశౌచము మృతాశౌచస్నానముతోనే గతమనెను. తంగెడగ్రామవాస్తవ్యుఁడును ద్రిరాత్రాశౌచజ్ఞాతియు నగు జానపాటి నరసింహము మృతుఁడు. అతఁడు మృతుఁడైన యాఱవ దినమున నడిగొప్పులజ్ఞాతికూఁతురు మాతామహస్థానమైన పిడుగురాళ్ళలోఁ బ్రభవించినది. ఆదినమున విశ్వనాథ మక్కడనే యుండెనఁట. వెంటనే వినెనఁట. తంగెడ జ్ఞాతి మృతి తరువాత శ్రవణించెనఁట. శ్రవణించుటతోడనే తన్మృతాశౌచనివృత్తికిఁగా స్నానము చేసెనఁట. ఆమృతాశౌచస్నానముతోనె యీజాతాశౌచము దినత్రయములోపలనే తీఱిపోయెనఁట. అట్లని జాతాశౌచత్రిదినముననే శ్రాద్ధాన్నమునకు సిద్ధమయ్యెను. శ్రాద్ధము మాయూరి కరణము మాతామహునిది. అతఁ డప్పటికింకను గరణికపుఁ జార్జీ తీసికొనలేదు. తత్కరణికభిక్ష విశ్వనాథమే పెట్టెనని వీరియింటిలోని యందఱికి విశ్వాసము. వాస్తవము కాకున్నను వాని మాయమాటలు వారి నటుల నమ్మించెను. వేయేల వీనిమాట వేదాక్షరమే యైపోయెను.

వాఁడానాఁడు తన కేదో పనియుండి చనుచుఁ బెదతండ్రికొడుకు వెంకటేశ్వరులను మేనమామ నరసింహమును శ్రాద్ధభోక్తృత్వమునకు నియమించెను. నాఁడు జాము ప్రొద్దెక్కినప్పటికి నా కెవరో యిట్లని యీ సంగతివచ్చి చెప్పిరి. ధర్మభంగభీతి తలఁపున బాధించుటయుఁ జప్పునఁ గరణముగారి సదనమునకుఁ జనితిని. పురుడు పోలేదనియు సరిగా విచారించి శ్రాద్ధముపెట్టుఁడనియుఁ జెప్పివచ్చితిని. సంశయించి వారు వెంకటేశ్వరులకు మాఱుగా వేఱొకరిని బిలుచుకొనివచ్చుటకుఁ బిడుగురాళ్ళకు వెళ్ళిరి. ఆవెళ్ళినది కరణము మేనల్లుఁడు దండెంరాజు కేశవరావు. అతఁడు పిడుగురాళ్లకుఁ బోవునప్పటికి వేఱుపనిమీఁదవెళ్ళిన విశ్వనాథ మక్కడనే యగుపడియెను. అతని యాగమనమునకుఁగల కారణ మడిగి తెలిసికొనెను. అంతకుఁబూర్వ మాభోక్తృత్వమునకు నియమితుఁడైన మేనమామకంటెను దానే ముందు జానపాటికిఁ జనుదెంచెను. స్నాతుఁడై శ్రాద్ధముపెట్టు సద్మమునఁ బ్రవేశించెను. అదియంతయు నాకుఁ దెలియక యామద్వయము దాఁటుటచే నన్నమితిని యాదృచ్ఛికముగాఁ గరణము నింటి కరిగితిని. పంచలోఁ గుర్చీపైఁ బరుంటిని. కొంతసేపటికి వెంకటేశ్వరులు మడిగట్టుకొని వీరి యింటికి వచ్చెను. పురిటితోనే బ్రాహ్మణార్థముచేసెదవటరా యని పృచ్ఛించితిని. పురుడు పోయినదఁటకదాయని గొణుగుచు వంటయింటిలోనికి వెళ్ళిపోయెను. వీఁడు వచ్చుటయే తడవుగా విశ్వనాథ మాచమ్యయని వాచారంభము గావించెను. శ్రాద్ధకర్తచే సంకల్పము చేయించెను. తద్విధమంతయుం గని తల యూఁచితిని. పోనిండని కేశవరావు సవరింపవచ్చెను. మంచిది కానిమ్మని మాయింటికి వెళ్ళివచ్చితిని. ఎంత నన్ను లక్ష్యముచేయకుండ నుండినను నంతవఱకు నవ్వానియెడల నన్యథాభావము నాకు లేదు. ఆత్రొలిదినముననే యతని పేరిటి పోస్టుకార్డు నాదగ్గఱకు రాఁ బట్టుకొనిపోయి యిది నీదా పెదవిశ్వనాథముదాయని ప్రశ్నించితిని. నిజముగాఁ దాను మృతాశౌచస్నానముతోనే జాతాశౌచమునుండికూడ సంశుద్ధియగునని యభిప్రాయపడినను నంతవఱకు నరమరలేకుండఁ దనతో మాటలాడు నేను బ్రతివాదము చేయుచున్నపుడు వచ్చి ప్రశ్నింపవలసియుండెను.

అహంభావముతో నట్లు ప్రశ్నింపని పండితంమన్యుని బలుకరించుట భావ్యము కాదని లాతియూరిపండితుఁడు లంకా సాంబశాస్త్రిగారికి సంగతి యంతయు వ్రాసి జవాబు తెప్పించితిని. వారికిని వీరికిని వినిపించితిని. కాని వానివద్దకుఁ బోయి యిదియేమియని యడుగు సమర్థుఁడును సద్భావుఁడును జానపాటి భూసురులలోఁ గానఁబడఁడు. తనకుమాత్ర మేల యీవిషయమని నను నను వారలే కాని వాని నను వారు వర్తింపరు. పురిటివాని భోక్తగఁజేసిన వృథాశ్రాద్ధమగునని యనుకొనక కరణము నింటివా రట్లు కావించుటను నితరబ్రాహ్మణు లేమియు ననకుండుటను వీని యహంకారము పెరిఁగిపోయెను. వారము దినము లిట్లు వర్తించుచుండ నచ్చిన యాశౌచమేజాతదో యాజాత శాంతిక్రియకు మరల నట నందఱుం గూడిరఁట. వీరును వారును వేంకటేశ్వరులను వినిందించిరఁట. వాఁడు జరిపినపనికిఁ జాల నొచ్చుకొని సాలగ్రామతీర్థము పుచ్చుకొనెనఁట. వీనివలె వెల్లడిగాఁ గాకపోయినను విశ్వనాథముకూడఁ బుచ్చుకొనెనఁట. అట్లభిప్రాయపడితినని యొదవిన పొరపాటు నొప్పుకొనెనఁట.

జానపాటికి వచ్చి జరిగిన సమస్తమును సాంబశాస్త్రిగారు శ్రవణముల వేసిరి. ధర్మాచార్యుల మ్రోల జరుపఁబోవు తద్బహిష్కారప్రయత్నమును దద్దయు వారించిరి. పౌరపాటుని మత్స్యభక్షమునఁగూడ ననిపింతునని మరలించిరి. మాయూరి మునసబు దమయూరి మునసబు మొదలగువారిని బురుషోత్తమునింటఁ బ్రోగుచేసిరి. పౌరపాటు లోనగు ముక్కులను బురుషోత్తమప్రభృతుల మ్రోల మరల ననిపించిరి. అటు తరువాత నట కే నరుగుటయు నదియుంతయు నాతో ననువదించిరి. అపుడు నేను బ్రమాదవశమునఁ బడిన తప్పటభిప్రాయమే యైనచో మద్వాక్యమునుబట్టి యది యేలమరలించుకొనఁడని ప్రశ్నించునంతలోఁ జాలఁబనులున్నవి నాకని శాస్త్రిగారు పోవ కుండు ముండుమని నిర్బంధించుచున్నను నిల్వఁబడక వెళ్ళిపోయి జరిపినదోషమునకు సాంబశాస్త్రిగారి చైనుండి సాలగ్రామతీర్థమును దీసికొంటినిగాన నింకను నీయన మ్రోల నేమియొప్పుకొనవలెనని వీఁడు వివదించెడిని.

తాఁబడినది తప్పటభిప్రాయమని తత్పూర్వ మెప్పుడో యొప్పుకొనెననియు దేవతార్చనముచేసి నేను దీర్థమిచ్చుచోఁ దత్రిత్యేతరబ్రాహ్మణులతోఁపాటు తానును బుచ్చుకొనియెఁగాని యేతత్పాపనోదనార్థ మిండని యడిగి కాదనియు సాంబశాస్త్రిగారు సత్యమును జాఁటుచున్నవారు. నిజముగాఁ దాఁబడినది తప్పటభిప్రాయమే యైనప్పు డది బహిరంగముగా నొప్పుకొనుటకుఁగాని తన్నివృత్తికిఁగా నేమేని చేసికొనుటకుఁగాని యింత యభిమాన మేల ? ఇంత సిగ్గేల ?

ఆ. సిగ్గుచేత ద్విజులఁ జేరి వచింపక
రాజనందనంబు నోజ నొంద
కెవఁడు మేననున్న యేనస్సుతోడనే
కూలు వాని శిక్షకుండు యముఁడె.

(స్కాందమహాపురాణాంతర్గత నాగరఖండము. 6 ఆ. 898)

ఇంతసిగ్గు నింతయభిమానముఁ బెట్టుకొని యెవరితోడను జెప్పక మొదటినుండియు నిదితప్పని చెప్పెడి వంశజ్యేష్ఠుఁడను శంసాపాత్రుఁడను నగు నాముందఱను నొప్పుకొనక యెల్లరతోఁపాటుగా నింతతీర్థము దీసికొని "యేను బురటితోఁజేసిన బ్రాహ్మణార్థమునుండి పాసఁగిన దోసఁగు పోయినదండీ శాస్త్రులుగారూ" అని హాస్యముగా ననినమాత్రముననే యఘవిమోచన మగునా ? పశ్చాత్తాపమువలనఁగాని పాపము నశింపదు. చూడుఁడు.

శ్లో. కృత్వా పాపంహి సంతప్య తస్మాత్పాపా త్ప్రముచ్యతే
నైవం కుర్యాం పునరితి నివృత్యా పూయతేతు సః.

ఇట్లు పశ్చాత్తాపపడుటచేఁ బాపమునుండి విడువఁబడి మరల నిట్లుచేయ ననుటతోఁ బరిపూతుఁడుగూడ నగుచున్నాఁడని మనువే యనియున్నవాఁడు,